## క్లుప్తంగా

### మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల సెక్టార్ మీటింగ్‌లో బుధవారం మహిళా సాధికారతపై అంగన్‌వాడీ టీచర్లకు మహిళా సాధికారక హబ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సికలు మాట్లాడుతూ.. బేటీ బచావో, బేటీ పడావో పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ 14567లపై అవగాహన కల్పించారు.

### రోడ్డు నిర్మించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కొర్రిదుబ్బ గ్రామస్తులు

భీమారం: మండల కేంద్రం నుంచి ఎలకేశ్వరం మీదుగా కొర్రిదుబ్బ గ్రామానికి రోడ్డు నిర్మించాలని కొర్రిదుబ్బ గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాగా ఈ విషయంలో సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### దరఖాస్తు చేసుకోవాలని అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు బుధవారం ర్యాలీ తీశారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ ఏరియా, బజారు ఏరియా, కాంటా చౌరస్తా, ఏఎంసీ పుర వీధుల మీదుగా మీ సేవ వరకు నిర్వహించారు. ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరుతూ అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ షబానా అన్సారీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గద్దర్‌కు నివాళులు



జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై...

మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్/వేమనపల్లి: ప్రజా యుద్ధ నౌక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ఆట, పాటల ద్వారా పోరాడిన గద్దర్ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో రాముని చెరువు కట్టపైన వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మందమర్రి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టాలెంట్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో, వేమనపల్లి బస్టాండ్ వద్ద విద్యార్థి, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### ఉచిత కంటి వైద్య శిబిరం



బెల్లంపల్లి/దండేపల్లి: తాండూర్ మండలం బోయపల్లి గ్రామంలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, దండేపల్లి మండలంలోని మేదరిపేటలో వెరబెల్లి పౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. తాండూర్‌లో 110మందికి కంటి పరీక్షలు చేయగా, 32మందికి శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని గుర్తించారు. మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, రక్త పరీక్షలు చేశారు. కంటి శుక్లాలు కలిగి ఉన్న వారికి ఆదివారం బెల్లంపల్లి లయన్స్‌క్లబ్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామని నిర్వాహకులు తెలిపారు. మేదరిపేటలో సుమారు 400మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. 120మందికి శస్త్ర చికిత్స అవసరమని తేలడంతో పౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్ర చికిత్స చేపిస్తామని బీజేపీ జిల్లా మహిళా నాయకురాలు స్రవంతి తెలిపారు.

# ఆకతాయిలకే ఆట విడుపు!

ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, వ్యాయామం చేసుకునేందుకు మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లు ఆకతాయిలకు ఆటవిడుపునిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో కనీస మరమ్మతులకు నోచుకోలేకపోతున్నాయి. రక్షణ కూడా ఏర్పాటు చేయకపోవడంతో మందుబాబులకు, పోకిరీలకు అడ్డాలుగా మారుతున్నాయి. చోరీలకూ గురవుతున్నాయి. పలుచోట్ల నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

- మున్సిపాలిటీల్లో గాడి తప్పిన ఓపెన్ జిమ్‌లు
- రూ.లక్షల విలువైన పరికరాలు దొంగల పాలు
- మందుబాబులు, పోకిరీలకు అడ్డాలుగా మారుతున్న వైనం
- నిర్వహణ, మరమ్మతులపై దృష్టి సారించని యంత్రాంగం



బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో విరిగిపోయిన ఓ పరికరం

సాక్షి ఫోకస్

బెల్లంపల్లి: పురప్రజల కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన ఓపెన్ జిమ్‌ల నిర్వహణపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కనీస శ్రద్ధ చూపించడం లేదు. పాత బస్టాండ్ ఏరియా సింగరేణి తిలక్‌స్టేడియం, ఏఎంసీ ఏరియా క్రీడా మైదానం, పోచమ్మ చెరువు మినీ ట్యాంక్‌బండ్‌పై, పెద్దనపల్లి బస్తీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఓపెన్‌జిమ్‌లను ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడాకారులు, యువకులు, మహిళలు, వాకర్స్ బాగానే వినియోగించుకుంటున్నారు. కానీ మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఆకతాయిలు, మద్యం ప్రియులు, జల్సారాయుళ్లకు ఆటవిడుపును ఇస్తున్నాయి. ఏఎంసీ క్రీడా మైదానం ఆవరణలో చెట్ల నీడ మాటున ఓపెన్ జిమ్ ఉండటంతో జిమ్ పరికరాలపై కూర్చొని సేద తీరుతున్నారు. పోచమ్మ చెరువు కట్టపై ఉన్న ఓపెన్ జిమ్ చీకటి పడగానే మద్యం ప్రియులకు నిలయంగా మారుతోందనే విమర్శలు వస్తున్నాయి. పెద్దనపల్లి బస్తీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జిమ్‌తో చిన్నారులు, విద్యార్థులు ఆటలాడుకుంటున్నారు. ఇతరప్రాంతాల్లో ఉన్న ఓపెన్ జిమ్‌ల పరిస్థితి దాదాపు ఒకే తీరుగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. వీటిని ప్రతిష్ఠాపన కోసం తపనపడిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రస్తుతం అటు కన్నెత్తి చూడటం లేదు. రెండు, మూడు నెలల కోసారైన జిమ్‌ల మెయింటనెన్స్ నిర్వహించక పోవడంతో అక్కడక్కడా జిమ్ పరికరాలు సరిగ్గా పనిచేయని పరిస్థితులు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడి ఓపెన్ జిమ్‌ల నిర్వహణపై చిత్తశుద్ధితో వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

### విరగ్గొడుతున్నారు..!



మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో 8ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. కాగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు మాత్రమే రక్షణ ఉండగా, మిగితా వాటికి రక్షణ కరువైంది. ఒక్కో ఓపెన్ జిమ్‌ను రూ.10లక్షల చొప్పున నిధులు వెచ్చించి ఏర్పాటు చేయగా రక్షణ లేక అందులోని సామగ్రి చోరీకి గురవుతోంది. కొందరు ఆకతాయిలు అందులోని పరికరాలను ఎత్తుకెళ్తుండగా, మరికొందరు వాటిని ఇష్టారీతిన వినియోగించి విరగ్గొట్టుతున్నారు. దీంతో ప్రభుత్వం ఏ లక్ష్యంతోనైతే ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసిందో ఆ లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు.

### మరికొన్ని ఏర్పాటు చేయాలి...



లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయగా, ఆకతాయిలు కొన్ని పరికరాలను విరగ్గొట్టారు. కాగా వాటికి అధికారులు మరమ్మతు చేయించారు. ప్రస్తుతం ప్రజలు వాటిని వినియోగించుకుంటున్నారు. ఇంకా కొన్ని పరికరాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

### నస్పూర్‌లో ఏర్పాటుకు అడ్డంకులు..!



నస్పూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 7, 9, 11, 17, 21, 22, 23వార్డుల పరిధిలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు 3, 13వార్డుల్లో ఓపెన్ జిమ్‌లతో పాటు చిల్డ్రన్ పార్కులు ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పట్టణప్రగతి నిధులు కేటాయించారు. కాగా మున్సిపాలిటీ పరిధిలో అధిక సంఖ్యలో సింగరేణి స్థలాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యం స్థలాలు కేటాయించడంలో జాప్యం చేస్తుండడంతో, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ఆలస్యం అవుతుందని అధికారులు తెలిపారు. మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లలో అరకొర వసతులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### పాడైపోయినా పట్టించుకోవట్లే..!



రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఐదు చోట్ల ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఠాగూర్ స్టేడియం, హనుమాన్‌నగర్, రామ్‌నగర్, ఆర్‌కే-4 గడ్డ, బీజోన్ ఏరియాలలో ఒక్కో ఓపెన్‌జిమ్‌ను రూ.13లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. ప్రజారోగ్యం కోసం వీటిని ఏర్పాటు చేయటం బాగానే ఉన్నప్పటికీ నిర్వహణ మాత్రం కానరావటం లేదు. వీటిని ప్రారంభించి ఏడాది కూడా కాకపోగా, మరమ్మతులు లేక చాలామట్టుకు పాడైపోయాయి. పరికరాలు, కింద ఏర్పాటు చేసిన ఫ్లోర్ కూడా దెబ్బతింది. మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపిస్తూ ప్రజలకు వినియోగంలో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

### చెన్నూర్‌లో నిర్వహణపై నిర్లక్ష్యం..!

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కూరగాయల మార్కెట్లలో రెండు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. జిమ్‌లను ప్రతి పక్షం రోజులకు ఒక్కసారి వాటికి బిగించిన నట్లు, గ్రీసు ఎలా ఉందో పరిశీలించాల్సి ఉంది. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన జిమ్‌లో పరికరాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రమాదభరితంగా మారాయి. అధికారులు ఎప్పటికప్పుడు జిమ్‌లను పరిశీలించి వాటిని బాగు చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



### మందమర్రిలో నిరుపయోగంగా..!



మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల నిర్వహణ భారమై నిరుపయోగంగా మారాయి. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన జిమ్ సామగ్రి ఎక్కడికక్కడ పాడైపోయి పనికిరాకుండా పోయాయి. ఇప్పటికైనా అధికారులు వాటికి మరమ్మతు చేయించాలని, వాటి నిర్వహణ కోసం ఒకరిని కేటాయించాలని పలువురు సూచిస్తున్నారు.

## పంచాయతీ పాలక వర్గానికి ఆత్మీయ సన్మానం



దండేపల్లి: సర్పంచ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు



జన్నారంలో సన్మానిస్తున్న పంచాయతీ సిబ్బంది



కోటపల్లిలో..

దండేపల్లి/చెన్నూర్‌రూరల్/జన్నారం/బెల్లంపల్లి రూరల్/కోటపల్లి/లక్సెట్టిపేట/వేమనపల్లి: సర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి ఒకటితో ముగుస్తున్నందునా పలు గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గాలను ఆయా గ్రామాల ప్రజలు బుధవారం ఘనంగా సత్కరించారు. సర్పంచులు చేసిన సేవలను కొనియాడారు. ఐదేళ్ల పాటు గ్రామాల్లోని ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, ప్రజలకు సేవ చేయడానికి తమకు పదవులు కట్టబెట్టిన గ్రామస్తులకు సర్పంచులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు సేవ చేయడం హర్షనీయమన్నారు. గ్రామాల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. దండేపల్లి మండలం రాజుగూడ సర్పంచ్ లచ్చుపటేల్, పౌనకల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జక్కు భూమేష్, వేమనపల్లి మండలం నీల్వాయి, సుంపుటం గ్రామపంచాయతీల్లో సర్పంచ్ గాలి మధు, కొండగొర్ల బాపు, బెల్లంపల్లిరూరల్ మండలంలో సర్పంచులు గోమాస అశోక్ కుమార్, గాజుల రంజిత సన్మానం పొందారు. ఆయా కార్యక్రమాల్లో దండేపల్లిలో మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి మౌనిక, తాళ్లపేట ఉపసర్పంచ్ తిరుపతి, చెన్నూర్‌రూరల్ మండలంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్,జన్నారంలో సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవో రమేశ్, ఈవో రాహుల్ బెల్లంపల్లిరూరల్ మండలంలో ఉప సర్పంచ్‌లు రాజేశ్వరి, సురేందర్ గౌడ్, ఎంపీటీసీ శకుంతల, మండల కో-ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, పంచాయతీ కార్యదర్శులు కార్తీక్ రాజ్, లక్ష్మీ, కోటపల్లిలో ఎంపీపీ మంత్రి సురేఖా, ఎంపీడీఓ భాస్కర్, ఎంపీవో అక్తర్, వేమనపల్లిలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేష్, లక్సెట్టిపేటలో జెడ్పీటీసీ సత్తయ్య, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఎంపీవో ప్రసాద్, ఏపీవో వెంకటరమణ, ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సన్మాన కార్యక్రమానికి సర్పంచులు దూరం

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి సర్పంచులు దూరంగా ఉన్నారు. సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1వ తేదీ వరకు ముగుస్తుండంతో ఎంపీవో శ్రీనివాస్ మండలంలోని 11గ్రామపంచాయతీల సర్పంచులకు ఆహ్వానపత్రాలు పంపారు. అయితే సన్మాన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినా, ఒక్క సర్పంచు కూడా రాకపోవడంతో సన్మాన కార్యక్రమం రద్దు చేశారు.



వేమనపల్లిలో...



బెల్లంపల్లిరూరల్: సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తూ..



లక్సెట్టిపేటలో...

## క్రీడాపోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతి ఇస్తున్న ముఖ్య అతిథులు

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 28-31తేదీల్లో నిర్వహించిన పట్టణ స్థాయి కబడ్డీపోటీలు బుధవారం ముగిశాయి. అండర్-17 విభాగంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు కబడ్డీ పోటీలు ఏర్పాటు చేయగా, హోరాహోరీగా జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి, జిల్లా పరిషత్ బజార్ ఏరియా ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, జిల్లా పరిషత్ నంబర్-2 ఇంక్‌లైన్ పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. బాలికల విభాగంలో జరిగిన పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించగా, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, జిల్లా పరిషత్ బజారు ఏరియా ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతి గెలిచారు.విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా హాజరైన సంక్షేమ బాలుర గురుకుల (సీఓఈ) ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, కరీమున్నీసా, బండి రవి, చాంద్‌పాషా, సునీత, భాస్కర్, ప్రవీణ్, ఉమాకాంత్, పీడీ బాబురావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులకు రుణాలు ఇప్పించేలా చూడాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారని, కార్మికులకు ఆ బ్యాంకు నుంచి వ్యక్తిగత రుణాలను మంజూరు చేసేలా చూడాలని కోరుతూ మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచిర్యాల మున్సిపాలిటీలో 351మంది కార్మికులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారని, వారికి వ్యక్తిగత రుణాలు బ్యాంకు నుంచి ఇవ్వాలని కోరితే వారు ఇవ్వడం లేదని, అధికారులు రుణాలను ఇప్పించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, ఉప్పులేటి రామస్వామి, ఆత్మకూరి తిరుపతి, ఆవునూరి సుధాకర్, అర జయ, వెలకటూరి రాజు, జాగటి శ్రీనివాస్, చొప్పదండి రాజలింగు, చిప్పకుర్తి వెంకటేశ్, ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**సమ్మక్కకు మొక్కులు చెల్లింపు**

కాసిపేట: సమ్మక్క సారలమ్మ జాతర గడువు సమీపిస్తుండటంతో కోల్‌బెల్ట్ ప్రాంతంలో సమ్మక్క మొక్కుల చెల్లింపు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సోమగూడెంలో బుధవారం కార్మిక కుటుంబాలు ఎత్తు బంగారం(బెల్లం)తో పాటు మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

**అభినందన ప్రోత్సాహకాలు**

కోటపల్లి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకై కృషి చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో హెచ్‌ఎం యోగేశ్వర్ అభినందన పేరుతో ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమం చేపట్టారు. జనవరి నెలలో పావని, బాదావత్ బిక్కులను ఉత్తమ సేవా ప్రతిభా ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపిక శాలువాలో సత్కరించారు.

**పెంపుడు కుక్కలకు టీకాలు**

లక్సెట్టిపేట: మండలంలోని పోతపల్లి పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలోని పెంపుడు కుక్కలకు పశువైద్యాధికారులు టీకాలు వేశారు. వైద్యాధికారిణి శ్వేత మాట్లాడుతూ.. జంతు సంరక్షణ పక్షోత్సవాలలో భాగంగా పరిసర ప్రాంతాల్లోని పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్లు తెలిపారు.

**'ఆరోపణలు చేస్తే ఊరుకోం'**

బెల్లంపల్లి: కాంగ్రెస్ పార్టీపై, నాయకులపై తప్పుడు విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ.ఈసా, మండల సహకార సంఘం వైస్ చైర్మన్ రత్నాకర్‌రావు, ఎంపీటీసీ సిరంగి శంకర్ అన్నారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కాంగ్రెస్ పార్టీపై, నాయకులపై అర్థరహితమైన విమర్శలు చేశారని ఆరోపించారు. ఆయన చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

**పాఠశాల ప్రారంభం**

భీమిని: కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లి గ్రామ పంచాయతీలోని ప్రైమరీ పాఠశాల 'మనఊరు-మనబడి' కార్యక్రమం కింద పనులు పూర్తి కావడంతో బుధవారం స్థానిక సర్పంచ్ లింగంపల్లి సునీతతో కలిసి ఎంపీపీ సృజనరావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు.

### జీఎంను కలిసిన సీఎంవోఏఐ ఏరియా కమిటీ



మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా సింగరేణి అధికారుల సంఘం (సీఎంవోఏఐ) నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు బుధవారం ఏరియా జీఎం ఆఫీస్‌లో జీఎం మనోహర్‌ను కలిశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ప్రశాంతంగా ఎన్నికలు జరిపించినందుకు పూలమొక్క అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ఏరియా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాగవర్దన్, సెక్రెటరీ పైడీశ్వర్, జాయింట్ సెక్రెటరీ నరేష్, కొట్టి రవి, ట్రెజరర్ సుధారాణి, జాయింట్ ట్రెజరర్ సంతోష్ ఉన్నారు.

### రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై బుధవారం ఉద్యోగ విరమణ పొందిన కోల్‌కట్టర్ కార్మికుడు ఇనిగాల సుందరం దంపతులను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్‌కుమార్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: కంపెనీలో సర్వీస్ పూర్తి చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులను ఆర్కే న్యూటెక్ గనిలో ఘనంగా సన్మానించారు. బుధవారం గనిపై రిటైర్డ్ ఉద్యోగులు ధనుంజయ కోల్‌కట్టర్, జే కొమురయ్య ట్రామర్లను గని మేనేజర్ స్వామి రాజు శాలువాతో సన్మానం చేసి జ్ఞాపిక అందించారు.

### మహాసభ విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: మార్చి 3, 4, 5తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, సీపీఐ ఎంఎల్ రివల్యూషనరీ ఇన్షియేటివ్, సీపీఐ ఎంఎల్ ప్రొవిజనల్ సెంట్రల్ కమిటీ మూడు విప్లవ పార్టీల విలీనసభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు నంది రామయ్య, రమక్క పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899